



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

# రుణమాఫీ సంబరాలు



మానకొండూర్‌లో సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, వెలిచాల రాజేందర్‌రావు

- 36,913 మంది రైతులకు రుణ విముక్తి
- సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకాలు
- గ్రామాల్లో ర్యాలీలు.. స్వీట్ల పంపిణీ
- రైతులు, కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

కరీంనగర్ టౌన్, జూలై 18: రుణమాఫీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం గురువారం శ్రీకారం చుట్టింది. దీనితో జిల్లా వ్యాప్తంగా రైతులు, కాంగ్రెస్‌శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకాలు చేశారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో కరీంనగర్ సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన పార్టీనాయకులు, రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నంప్రభాకర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రామడుగు మండల కేంద్రంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్‌లో డీసీసీ అధ్యక్షు డు, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు రుణమాఫీ సంబరాల్లో పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. కరీంనగర్ జిల్లాలో 36,913 మంది రైతుల పంట రుణాలు తొలి విడతలో మాఫీ అయ్యాయి. వీరిలో 10వేల రూపాయలు మొదలుకొని లక్ష రూపాయలలోపు రుణాలు ఉన్నవారు ఉన్నారు. సుమారు 250 నుంచి 300 కోట్ల రూపాయల మేరకు రుణాలు మాఫీ అయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి రైతులతో ముఖాముఖీ మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా రైతు వేదికల్లో రైతులు, కాంగ్రెస్ నాయకులు, వ్యవసాయ, బ్యాంక్ అధికారులు వీక్షించారు. సంబరాల్లో పాల్గొన్నారు. కరీంనగర్ రూరల్ మండలంలో 1,896 మంది రైతులకు, కొత్తపల్లి మండలంలో 640 మందికి, చొప్పదండి మండలంలో 2,948 మంది, గంగాధర మండలంలో 2,587 మంది, రామడుగు మండలంలో 2,959, ఇల్లందకుంట మండలంలో 1,864, హుజురాబాద్ మండలంలో 2,573 మంది, జమ్మికుంట మండలంలో 2,145 మంది, సైదాపూర్ మండలంలో 2,835, వీణవంక మండలంలో 3,085 మంది, చిగురుమామిడి మండలంలో 2,557 మంది, గన్నేరువరం మండలంలో 1,164 మంది, మానకొండూర్ మండలంలో 4,865, శంకరపట్నం మండలంలో 2,735, తిమ్మాపూర్ మండలంలో 2,060 మంది రైతుల రుణాలు గురువారం మాఫీ అయ్యాయి.

## ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాలు
- 1,109 మందికి 950 మంది అభ్యర్థులు హాజరు



తిమ్మాపూర్‌లోని అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్, జూలై18: రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 5 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, వాణీనికేతన్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, తిమ్మాపూర్‌లోని ఐయాన్ డిజిటల్ జోన్, హుజురాబాద్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల, సైనపరీక్ష కేంద్రాలలో ఈ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలు ఆగస్టు 5 వరకు కొనసాగనున్నాయి. మొత్తం జిల్లాలో 27,104 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. 18న మొదటి రోజు రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్, ఫిజికల్ సైన్స్ మధ్యాహ్నం ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక పేపర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో పేపర్ పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 1,109 మంది అభ్యర్థులకు950 మంది పరీక్షకు హాజరయ్యారు.

### ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

గణేశ్‌నగర్,జూలై 18: ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతి తెలిపారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ)ఉత్తర తెలంగాణ జిల్లాల సమావేశం గురువారం నగరంలోని వాగేశ్వరీ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద గణేష్ అధ్యక్షతన జరిగిన సమా వేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు గడుస్తున్నప్పటికీ పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియ మించక పోవడం శోచనీయమన్నారు. అధికారంలోకి రాకముందు యూని వర్సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఇన్‌చార్జీ వీసీలను నియమించడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ 8000 కోట్ల రూపాయలను ఎందుకు విడుదల చేయడం లేదన్నారు. సంక్షేమ హాస్టళ్లలో పెరిగిన ధరలకు అను గు ణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉత్తర తెలంగాణకు సంబంధించిన వివిధ విద్యార్థి సంఘం నాయకులు యుఎస్ఎఫ్ఐ సంఘంలో చేరారు.సమా వేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బి తిరుపతి కుమార్, జిల్లా నాయకులు సంతోష్, మల్లికార్జున, సతీష్ పాల్గొన్నారు.



# కీలక పోస్టులు ఖాళీ



- బల్దియాలో కమిషనర్‌తో సహా కీలక అధికారులు లేరు
- ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్లో బదిలీలు
- సాధారణ బదిలీల్లోనైనా భర్తీ అయ్యేనా?

కరీంనగర్ టౌన్, జూలై 18: శరవేగంగా నలుదిశలా విస్తరిస్తూ ఉత్తర తెలంగాణకే కేంద్ర బిందువుగా మారిన కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో కీలకమైన పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇంచార్జీల పాలన సాగుతోంది. దీనితో నగర ప్రజలకు పౌరసేవలు సిటిజన్ చార్టర్ ప్రకారం అందక పోవడంతో కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులకే అదనపు బాధ్యతలు అప్పగిస్తుండడంతో వారు కూడా ఎటూ పూర్తి సమయం కేటాయించలేక పనులు సకాలంలో పూర్తి కావడం లేదు. మరో వైపు అదనపు పనిభారంతో అవస్థలు పడుతున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. నగర జనాభా 2,61,185 నుంచి దాదాపు ఐదు లక్షలకు చేరుకుంది. నగరపాలక సంస్థ పరిధిలోకి శివారులోని ఏడు గ్రామాలను విలీనం చేయడంతో 50 నుంచి 60 డివిజన్లు కాగా, నగర విస్తీర్ణం 23.85 కి.మీ. నుంచి 65.334 కి.మీ.కు పెరిగింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరపాలక సంస్థలో అధికారులను, ఉద్యోగులను నియ మించడం లేదు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, అధికారుల స్థానంలో, బదిలీపై వెళ్లిన వారి స్థానంలో గత కొన్ని సంవత్సరా లుగా కొత్తవారికి పూర్తిస్థాయిలో పోస్టింగ్ ఇవ్వడం లేదు. దీనితో నగర పౌరులకు సరైన సేవ లను అందించడంతో పాటు అభివృద్ధి పను లను కూడా పూర్తి స్థాయిలో అందించలేని పరిస్థితి నెలకొన్నది. నగరపాలక సంస్థలోని ఖాళీలను వెంటనే భర్తీ చేసి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అవ కాశం కల్పించాలంటూ 2021 జనవరి 20లో మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆనాటి రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం పంపిం చారు. అయితే ఆ లేఖ తర్వాత కూడా ఎంతో మంది అధికారులు, ఉద్యోగులు బదిలీపై కొందరు, బదిలీపై వెళ్లాలని ఆదేశించడంతో మరికొందరు, పదవీ విరమణ చేసి ఇంకొందరు ఇక్కడి నుంచి వెళ్లి పోయారు. అయినా కూడా ఖాళీలను భర్తీ చేయకుండా ఇంచార్జీలతో ప్రభుత్వం నెట్టుకు వస్తున్నది.

- నగరపాలక సంస్థలో అత్యంత కీలకమైన కమిషనర్ పోస్టుకు ఐఏఎస్ అధికారిని పూర్తిస్థాయిలో నియమించక పోవడంతో ప్రస్తుతం స్థానిక సంస్థల అదనపు కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పూర్తి అదనపు బాధ్యతలతో కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే అడిషనల్ కమిషనర్ పోస్టు ఒకటి, అసిస్టెంట్ కమిషనర్ పోస్టు ఒకటి ఖాళీగా ఉండ డంతో ఆయా బాధ్య తలను కూడా ఇతర అధికారులకు అప్పగించడంతో సేవ లు సకాలంలో అందడం లేదు. ఏడుగురు సూపరింటెం డెంట్ పోస్టులకు నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా మూడు పోస్టులు ఖాళీగా ఉండడంతో కార్యాలయంలో సాధారణ విధి నిర్వహణ సరిగా జరుగడం లేదు.
- కిందిస్థాయి ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హాజరు పట్టికలో అటెండెన్స్ వేసుకొని దర్జాగా ఇతర పనులు సాకుగా చూపుతూ చాలా మంది ఉద్యోగులు పనివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండక పోవడంతో చాలా కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.
- ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత కీలకమైన హెల్త్ ఆఫీసర్ పోస్టు ఏళ్ల తరబడి ఖాళీగా ఉంటోంది. సానిటరీ సూపర్‌వైజర్లు నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉండగా ఈ పోస్టులు కూడా భర్తీ చేయలేదు. ఇటీవల ఒక సానిటరీ సూపర్‌వైజర్ దీర్ఘకాలిక సెలవుపెట్టి వెళ్లగా ఇంచార్జీకి ఆ బాధ్యతలను అప్పగించారు. స్మార్ట్‌సిటీ, సీఎం హామీ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్‌తో కోట్ల రూపాయల పనులు జరుగుతున్న కరీంనగర్ కార్పొరేషన్‌లో అత్యంత కీలకమైన ఇంజనీరింగ్ విభాగంలో ఎస్ఈ లేరు.. ఇద్దరు ఈఈలకు గాను ఒకరే ఉండగా ఆయనకే ఎస్ఈ ఇంచార్జి బాధ్యతలను అప్పగించారు. డీఈఈ, ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- పట్టణ ప్రణాళికా విభాగంలోని డిప్యూటీ సిటీ ప్లానర్‌ను ఇటీవల ప్రభుత్వం సరెండర్ చేయడంతో ఆ పోస్టులో ఎవరిని నియమించకుండా ఏసీపీకి అదనపు ఇంచార్జి బాధ్యతల ను అప్పగించారు. మరో ఏసీపీ పోస్టు ఖాళీగా ఉండగా టీపీఎస్, టీపీబీవోస్, యుడి ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ పోస్టులతో పాటు పిహెచ్ వర్కర్లు కూడా పూర్తిస్థాయిలో లేరు. దీనితో గత కొన్నేళ్లుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతోనే కీలకమైన విధులను నిర్వహించడమే కాకుండా అదనపు బాధ్య తలను కూడా అప్పగిస్తున్నారు. అయితే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అర్హత లేని బాధ్యత లను అప్పగించడంతో నిబంధనల మేరకు ప్రజలకు సేవలందడం లేదనే విమర్శలు వస్తున్నాయి.
- మున్సిపాలిటీని 2005లో నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ చేసిన ఆనాటి ప్రభుత్వం ఆ మేరకు ఖాళీలను మాత్రం భర్తీ చేయలేదు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కూడా కీలకమైన పోస్టులను కూడా భర్తీ చేయక పోవడంతో నగరపాలక సంస్థ పేరుగొప్ప ఊరుదిబ్బగా మారిందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లకు పైబడి ఒకే చోట ఉద్యోగం చేస్తున్న వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులను బదిలీ చేసేందుకు సాధారణ బదిలీ చేపట్టింది. ఈ బదిలీల్లోనైనా నగరపాలక సంస్థలోని ఖాళీలను భర్తీ చేస్తారో లేక ఇదే విధంగా ఇంచార్జీలను కొనసాగిస్తారా అనే చర్చ జరుగుతోంది.

**నగరపాలక సంస్థలో పలువురు బదిలీ**

కరీంనగర్ టౌన్: ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా చాలా కాలంగా పనిచేస్తున్న పలువురు నగరపాలక సంస్థ ఉద్యోగులు బదిలీ అయ్యారు. తొమ్మిది మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌ను సిరిసిల్ల మున్సిపల్‌కు, మరో సీనియర్ అసిస్టెంట్ రషీద్ హుజూరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఇద్దరు వార్డు ఆఫీసర్లు కలీల్, కవ్వంపల్లి మల్లేశంలను హుజూరాబాద్ మున్సిపల్‌కు, రమాదేవిని చొప్పదండి మున్సిపాలిటీకి, నలుగురు బిల్ కలెక్టర్లు శ్రీకాంత్, చంద్రశేఖర్, శంకర్, అనురాధలను హుజూరాబాద్ మున్సిపాలిటీకి బదిలీ చేశారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో చేపడుతున్న బదిలీ ప్రక్రియలో మరికొంత మంది బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. వీరి స్థానంలో ఇంకా ఎవరిని నియమించారనే విషయం తెలియాల్సి ఉంది.

# రైతులు ఇబ్బందులు పడకుండా చూడండి

- 35,686 మంది రైతులకు రుణమాఫీ
- రూ.194.64 కోట్లు జమ
- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తుందని, ఈ సందర్భంగా రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతు రుణమాఫీ పథకంపై బ్యాంకర్లతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో 35,686 రైతులు, వారి కుటుంబాలకు సంబంధించిన 37,745 బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం 194.64 కోట్లను జమ చేయనుందని అన్నారు. రేషన్‌కార్డును కేవలం రైతు కుటుంబాల గుర్తింపు కోసమే ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. రైతు కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకొని రైతు రుణమాఫీ వర్తింపజేస్తుందని చెప్పారు. బ్యాంకు ల్లో రైతుల అనుమానాలు నివృత్తి చేసేందుకు విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులతో మర్యాదగా వ్యవహరించాలని, నిర్లక్ష్యంగా సిబ్బంది సమాధానాలు ఇవ్వద్దని, లేనిపోని అపో వాలు సృష్టించేలా వ్యవహరించవద్దని బ్యాంక ర్లకు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రుణమాఫీపై రైతులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసే విధంగా కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని చెప్పారు. గ్రామాల్లో వ్యవసాయాధికారులు కూడా రైతులకు అందుబాటులో ఉంటూ సూచ నలు సలహాలు అందించాలని, రైతుల రద్దీని దృష్టిలో పెట్టుకొని బ్యాంకుల్లో తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఎల్‌డీఎం అంజ నేయులు, జిల్లా వ్యవసాయ అధికారి బత్తుల శ్రీనివాస్, కేడీసీసీబీ సీఈవో సత్యనా రాయణరావు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'రైతు భరోసా' ప్రజాభిప్రాయ సేకరణ



వి కన్వెన్షన్‌లో రైతు భరోసా ప్రజాభిప్రాయసేకరణ వర్క్‌షాప్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, జూలై 18: జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్డు వి-కన్వెషన్‌లో నిర్వహించనున్న రైతు భరోసా ప్రజాభిప్రా యసేకరణ వర్క్‌షాపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె వి- కన్వెషన్‌ను సందర్శించి, వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న వర్క్‌షాపునకు సబ్ కమిటీ చైర్మన్, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని చెప్పారు. రైతులు, రైతు ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడ కుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడ కూడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని పక్కాగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, ఆర్డీవో కె.మహేశ్వర్, ఏడీఏ రణధీర్‌రెడ్డి, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ నవీన్‌కుమార్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.






Gీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట, జూలై 18: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన నాగపూరి సంతోష్ అనే గీత కార్మికుడు గురువారం తాటిచెట్టుపై నుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. రోజు వారి పనిలో భాగంగా సంతోష్ కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు జమ్మి కుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సంతోష్‌గౌడ్‌కి భుజం విరిగి నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుడిని ఆదుకోవాలని స్థానికులు కోరారు.







జీఎస్టీ అధికారుల అవగాహన

- భయంతో దుకాణాలు బంద్ చేసిన వ్యాపారులు



అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి రజక్, సిబ్బంది

ముస్తాబాద్, జూలై 18: ముస్తాబాద్ మండల కేంద్రంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అధికారులు పలు వ్యాపార వాణిజ్య దుకాణాలకు అవగాహన కల్పించడం కోసం రాగానే గమనించిన వ్యాపారస్తులు దుకాణాలన్నీ బంద్ చేశారు. ముస్తాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా దుకణాల మూసివేతతో బంద్‌ను తలపించింది. జిల్లా కమర్షియల్ ట్యాక్స్ అధికారి రజక్ తన బృందంతో జీఎస్టీపై అవగాహన కల్పించేందుకు ముస్తాబాద్‌కు గురువారం వచ్చారు. జీఎస్టీ వలన కలిగే ఉపయోగాలను, ఉచితంగా జీఎస్టీ నమోదు చేయడం వంటి వివరాలను తెలియజేయడానికి జీఎస్టీ నమోదు లేని దుకాణ యజమానులకు వివరించేందుకు వచ్చామని, నమోదుతో ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు.

గొలుసుకట్టు మార్కెటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్ల క్రైం, జూలై 18: జిల్లాలో గొలుసుకట్టు (చైన్)మార్కెటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలని పోలీసుశాఖ ప్రకటించింది. గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సైబర్ సెల్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఏదైనా కంపెనీ పేరుతో ముందుగా మీరు కొంత డబ్బులు కట్టి జాయిన్ అవ్వండని, ఆ తర్వాత అందులో మరో ముగ్గురిని జాయిన్ చేస్తే లైఫ్ లాంగ్ ఆదాయం ఉంటుందని చెప్పి మోసం చేస్తారని సైబర్‌సెల్ పేర్కొంది. ఏలి అండ్ లిల్లి యాప్, వేక్ యాప్, వియాక యాప్, గ్రోమో యాప్, క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్ ట్రేడింగ్ అండ్ ఆన్‌లైన్ మల్టీలెవల్ మార్కెటింగ్ కంపెనీలో అత్యాశకు పోయి డబ్బులు పెట్టి మోసపోవద్దని వెల్లడించింది. సైబర్ నేరగాళ్లు వాట్సాప్ లేదా టెలిగ్రామ్ ద్వారా ఏ యాప్‌నైనా డౌన్‌లోడ్ చేసుకోమని చెప్తే చేసుకోవద్దని, వెబ్ సైట్‌ను నమ్మవద్దని, ఇదంతా మోసం అని గ్రహించాలని పేర్కొంది. సోషల్ మీడియాలో మోసపూరిత ప్రకటనలు చూసి సొమ్మును అనాలోచితంగా అత్యాశకు పోయి గుర్తు తెలియని యాప్‌లో పెట్టి కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసుకోవద్దని, జాగ్రత్తగా ఉండాలని సైబర్ సెల్ వారు ఒక ప్రకటనలో తెలిపారు.

గంజాయి విక్రయిస్తే సమాచారం ఇవ్వాలి

సిరిసిల్ల క్రైం, జూలై 18: మీ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారా... అయితే వెంటనే 8712656392 కు సమాచారం ఇవ్వండని పోలీసుశాఖ విస్తృత ప్రచారం చేపట్టింది. గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఇందుకు సంబంధించిన లోగోను విడుదల చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఎవరైనా మత్తుపదార్థాలను (గంజాయి) అమ్మినా, తాగినా, సాగుచేసినా వారి గురించి ఎవరైనా సమాచారం తెలిస్తే ఫోన్ ద్వారా లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసు శాఖ పేర్కొంది. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని ప్రకటించింది.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. గురువారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గే ట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 25,694 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రా జెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 14.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 24.795 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 447 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 8.777 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.938 టీఎంసీల నీటిని అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

రెండు బైక్‌లు చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 18: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని అల్వాల రాజు, మొదుసు గౌరయ్యలకు చెందిన రెండు ద్విచక్రవాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి చోరీ చేశారని బాధితులు తెలిపారు. గ్రామంలోని రాజు, గౌరయ్యలు తమ బైక్‌లను బుధవారం రాత్రి ఇంటి ఎదుట నిలిపి ఉంచారు. గురువారం ఉదయం చూసే సరికి వాహనాలు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు ఎతుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు రాజు, గౌరయ్య తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.














































## కుక్క దాడిలో మున్సిపల్ సిబ్బందికి గాయాలు


కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన భాగ్య

హుజూరాబాద్, జూలై 18: హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో రెండు రోజులుగా పిచ్చికుక్క స్వైర విహారం చేసి సుమారు 40మందిని దాడి చేసి, గాయపరిచింది. గురువారం హుజూరాబాద్ పట్టణంలో మున్సిపల్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పిచ్చికుక్క మున్సిపల్ సిబ్బందిపై విరుచుకు పడింది. దీంతో పలువురికి గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో ఇన్‌చార్జీ సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కిషన్ రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, రమేశ్ పిచ్చి కుక్క కనబడగా పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా కుక్క ఆరెల్లి రమేశ్‌ను గాయపరిచింది. అతడిని చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్రమత్తమైన మున్సిపల్ సిబ్బంది డాగ్ స్కాచ్‌ను పిలిపించి కుక్కను హతమార్చరు. కాగా గాంధీనగర్ నుంచి విధులకు వస్తున్న భాగ్యను కూడా తీవ్రంగా గాయపర్చగా వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ వీధి కుక్కల బారిన ప్రజలు పడకుండా ఉండేందుకు ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## బాలుడిపై శునకం దాడి

ఓదెల, జూలై 18 : మండలంలోని గూడెంలో గురువా రం కొమ్ము మోక్షిత్ అనే బాలుడిపై శునకం దాడి చేసింది. జమ్మికుంటకు చెందిన మోక్షిత్ ఇటీవల తన అమ్మమ్మ గ్రామమైన గూడెంకు రాగా, దారి వెంట వెళ్తున్న క్రమంలో కుక్కలు దాడి చేయడంతో చెంపకు రెండు చోట్ల గాయాలయ్యాయి. అక్కడున్న వారు మోక్షిత్‌ను రక్షించారు. దీంతో కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

## రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, జూలై 18: మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన గాజుల పర్శరాములు (43) అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పర్శరాములు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపం చెంది జమ్మికుంట రైల్వే స్టేషన్‌కు కొంత దూరంలో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పర్శరాములు భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

## రూ. కోటి అప్పు చేసి పరారీ..బాధితుల ఆందోళన


వ్యాపారి ఇంటి ఎదుట గుమికూడిన బాధితులు

మెట్‌పల్లి రూరల్, జూలై 18: ఎక్స్‌కావేటర్ యజమాని సుమారు కోటికి పైగా అప్పు చేసి పరారైన సంఘటన మెట్‌పల్లి మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో చోటుచేసుకుంది. గురువారం బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..జగ్గసాగర్ గ్రామానికి చెందిన పెంట మహిపాల్ తనకున్న ఎక్స్‌కావేటర్ కిరాయికి నడుపుతూ ఉండేవాడు. ఊర్లో అందరితో పరిచయాలు పెంచుకున్నాడు. అత్యవసరం ఉందని కొంత మంది వద్ద వడ్డీకి అప్పులు తీసుకున్నాడు. ఉన్న ఊరు వ్యక్తే కదా అనుకుని అప్పు ఇచ్చిన వారు కూడా ఎలాంటి పత్రం లేకుండా గుడ్డిగా నమ్మి అడినంగా ఇచ్చుకుంటు పోయారు. ఇవే కాకుండా తెలిసిన వృద్ధులు దాచుకున్న పింఛన్ డబ్బులతో పొదుపు చేసుకున్న మహిళలు, కూలీ నాలి చేసుకునే వారిని వదల కుండా మహిపాల్ అప్పులు తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వమంటే ఏదో సాకు చెప్పుకుంటూ కాలం వెళ్లదీసాడు. సుమారు కోటి రూపాయల వరకు అప్పు చేయడంతో అప్పు ఇచ్చిన వారు డబ్బులు ఇవ్వమని ఒత్తిడి చేశారు. అప్పు తీర్చే దారి లేక కుటుంబ సభ్యులతో కలిసి పారియాడు. గురువారం ఇంటికి బాధితులు వెళ్లి చూసేసరికి ఇంటికి తాళం వేసి ఉండటం, ఫోన్ చేసినా సమాధానం లేకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటూ వాపోతున్నారు. గ్రామాల్లో పలువురు వద్ద లక్షల రూపాలయలు అప్పుగా చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

## యువకుడి బలవన్మరణం


అభిలాష్(ఫైల్)

కమాన్‌పూర్, జూలై 18: మండల కేంద్రంలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యు లు తెలిపిన వివరాల ప్రకారం.. కమాన్‌పూర్ గ్రామానికి చెందిన రెడ్డి అభిలాష్(20) డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొద్దీ రోజులుగా కుటుంబ సభ్యులతో కలిసి గోదావరిఖనిలోని వైట్‌టింక్లయిన్ కాలనీలో ఉంటు న్నాడు. గురువారం స్వగ్రామంలోని ఇంటికి వచ్చి ఉరేసు కొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి రెడ్డి స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## కూతురితో ప్రేమను వదులుకోవాలని హత్యాయత్నం

**- యువకుడు లేకపోవడంతో తండ్రిపై దాడి**

**- దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్టు**


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నీలం రవి

మల్యాల, జూలై 18: తన కూతురితో ప్రేమ వ్యవహారం మానుకోవాలని పలుమార్లు హెచ్చరించినా వినకపోవడంతో అమ్మాయి తండ్రితో పాటు బాబాయి యువకుడి ఇంటిపై దాడికి వెళ్లారు. కానీ అక్కడ యువకుడు అందుబాటులో లేకపో వడంతో అతడి తండ్రి పై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరినీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మల్యాల సీఐ నీలం రవి తెలిపిన వివరాల ప్రకారం.. మ్యాడంపల్లికి చెందిన గుర్రం చిన్నమల్లయ్య కొడుకు రాజ్‌కుమార్ ఇదే గ్రామానికి చెందిన బాసవేని గంగాధర్ కూతురు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తన బిడ్డతో ప్రేమ విషయం మరచిపొమ్మని బాసవేని గంగాధర్, అతని తమ్ముడు అంజి పలుమార్లు రాజ్‌కుమార్‌ను హెచ్చరించారు. అయినప్పటికీ ప్రేమ వ్యవహారం కొనసాగుతుం డడంతో రాజ్‌కుమార్‌ను చంపాలని నిర్ణయించుకున్న గంగాధర్, అంజి ఈ నెల 14న రాత్రి రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లారు. ఇంట్లో రాజ్‌కుమార్ లేకపోవడంతో అతని తండ్రి గుర్రం చిన్నమల్లయ్యపై అంజి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పారిపోయారు. దీంతో గుర్రం రాజ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నరేష్ కేసు నమోదు చేశారు. గురువారం అంజి, గంగాధర్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ పేర్కొన్నారు.

## ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

**- కరీంనగర్‌కు చెందిన వ్యక్తి భూపాల్‌పల్లిలో అరెస్టు**

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 18: ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తిని, అతనికి సహకరించిన మరో ఇద్దరిని భూపాలపల్లి పోలీసలు కటకటాల్లోకి పంపించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే గురువారం భూపాలపల్లిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు చూపి వివరాలను వెల్లడించారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన గుర్రం శ్రీనివాస్‌రావు.. భూపాలపల్లి కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో సెక్యూరిటీ గార్డు, స్వీపర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయుటకు కాంట్రాక్టు తనకే వస్తుందని నమ్మబలికాడు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు, ఆశావాహుల నుంచి సుమారు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు వసూలు చేశాడు. కొంత మందికి జాబ్ కల్పించినట్లుగా డ్యూటీలు చేయించి జీతాలు ఇవ్వకుండా తప్పించుకుని తిరిగేసరికి శ్రీనివాసరావుపై కొంత మందికి అనుమానం కలిగింది. ఇతనికి మరో ఇద్దరు సహకారం అందించారు. నిందితులైన ఆముగ్గురిని బుధవారం రాత్రి అదుపులోకి తీసుకొన్నారు. ఈ మేరకు డబ్బులు తీసుకున్నట్లు అంగీకరించడంతో గురువారం శ్రీనివాసరావు, సుభాష్, అశోక్‌లను రిమాండ్‌కు పంపించారు.

## సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకం

**▸ గిరిజన వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి ▸ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్**


మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

సిరిసిల్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకమని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌లతో కలిసి సమీక్షించారు. జిల్లాకు వచ్చిన హుస్సేన్‌కు కలెక్టర్, ఎస్పీ అధికారులు ఘనంగా స్వాగతించారు. అనంతరం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం కమిషన్ పనిచేస్తోందని చెప్పారు. గిరిజనులకు ఇబ్బందులు కలిగిస్తే ఎంతవా రినైనా శిక్షించే అధికారం కమిషన్‌కు ఉందన్నారు. ప్రజాసమస్యలను సంబంధిత అధికారులు గ్రామ స్థాయిలో మండల స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. కమిషన్ ప్రతీ మూడు నెలలకు ఒకసారి క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తుందని అన్నారు. దేశ వ్యాప్తంగా వ్యక్తిగతంగా పర్యటిస్తూ గిరిజనుల జీవితాల్లో పురోగతిని కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల స్థితిగతులపై సమీక్షిస్తూ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కిందిస్థాయిలోనే చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేయాలన్నారు. గిరిజనులు అధికంగా ఉన్న గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, అవసరమైన శిక్షణలు గ్రామీణ యోజన పథకం కింద చేపట్టాలని చెప్పారు. గిరిజనులకు హక్కుగా రావాల్సిన పోడు పట్టా భూములు అర్హత మేరకు పకడ్బందీగా సర్వే నిర్వహించి పంపిణీ చేయాలని తెలిపారు. సమావేశంలో గిరిజన సంక్షేమ అధికారి జనార్దన్, సిరిసిల్ల, వేములవాడ అర్డీవోలు రమేశ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు

## పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య

సిరిసిల్ల టౌన్, జూలై 18: గ్రామపంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడదల చేయాలని తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు ఉన్నాయన్నారు. 2019 నుంచి గ్రామాల అభివృద్ధి పనులకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రొసీడింగ్‌లు ఇవ్వడంతో అప్పటి సర్పంచ్‌లు లక్షల రూపాయలు అప్పులు తీసుకొచ్చి గ్రామాల అభివృద్ధి కోసం ఉపయోగించారని అన్నారు. గ్రామాలు అభివృద్ధి కోసం సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు రాక కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు సర్పంచ్‌లు బిల్లులు రాక అప్పులకు వడ్డీలు కడుతూ ఆర్థికంగా చితికిపోతున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేయవద్దని వెంటనే గ్రామపంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లును చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సర్పంచ్‌ల బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుంటుం దని హెచ్చరించారు. సమా వేశంలో తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాలకర్ శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంపనూరి మల్లేశంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవుని సుజాతనర్సయ్య, జిల్లా కార్యదర్శి నారాయణ, నియోజకవర్గం అధ్యక్షుడు పిట్టల వెంకటేష్, వేముల వాడ మండల అధ్యక్షుడు దొంతి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## గ్రూప్-1 మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై18: గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం తుది గడువని కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఔత్సాహికులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్ www. tgbcstudy-circle. cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 75 రోజులపాటు నిర్వహించే శిక్షణ ఈనెల 22న మొదలవుతుందని పేర్కొన్నారు. అభ్య ర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్ష లోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో నెలకు రూ.5000 ఉపకార వేతనం అందజే స్తామన్నారు. ఉచిత శిక్షణ హైదరాబాద్ సైదాబాద్‌లో ని టీజీ బీసీ స్టడీసర్కిల్‌లో, ఖమ్మంలోని టీజీ బీసీ స్టడీసర్కి ల్‌లలో ఇస్తారస్తారు. సమాచారం కోసం 040-24071178 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## స్వగ్రామానికి చేరిన మృతదేహం

ముస్తాబాద్, జూలై 18: సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతి చెందిన వ్యక్తి మృతదేహం గురువారం ఇంటికి చేరుకోవడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగారు. మండలంలోని వెంకయ్యకుంటకు చెందిన పిట్ల మహేశ్(45) 15 ఏళ్లగా సౌదీ అరేబియాలో అల్ జమీల్ కంపెనీలో కులీగా పనిచేస్తున్నాడు, ఈనెల 4వతేదీన గుండెపోటు రావడంతో చనిపోయడాని కుటుంబీకులు తెలిపారు. సౌదీ నుంచి మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సుమారు ఐదు లక్షల రూపాయల వరకు అప్పు ఉందని తెలిపారు. తల్లి మల్ల వ్వ, భార్య కావ్య, కుతూరు నేహ, కొడుకు నవనీత్‌లున్నారు. తెలంగాణా ఎన్ఆర్ఐ డిపార్ట్‌మెంట్ ఇన్ చార్జ్ చిట్టి బాబు, జనగామ శ్రీనివాస్ మృతదేహం హైదరాబాద్ నుంచి స్వగ్రామం రావడం కోసం అంబు లెన్స్‌లో ఏర్పాటు చేశారు. మృతుడి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు.

## రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి అధికారుల తనిఖీలు


శ్రీరామ ఇండస్ట్రీస్‌లో తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయి అధికారులు

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో గురువారం సివిల్ సప్లయి అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయి శాఖ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇతర జిల్లాలకు చెందిన సివిల్ సప్లయి అధికారులు, ఎన్‌ఫోర్స్ బృందాలు రైస్ మిల్లుల్లో దాడులు నిర్వహించారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం నిల్వలు సరిగా ఉన్నాయా...లేవా అన్న అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని మూడు చోట్ల సోదాలు జరిగాయి. వెల్లటూరు మండలం అంబారిపేటలో గల శ్రీరామ ఇండస్ట్రీస్, రాయికల్ మండలం షైతాపూర్‌లో గల శివమణి ఇండస్ట్రీస్, కోరుట్ల మండలం జోగినిపల్లిలో గల ఎస్ఎల్ఎన్ఎస్ పారాబాయిల్డ్ రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి అధికారులు సోదాలు నిర్వహించారు. రైస్ మిల్లుల్లో గల ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ జరిపా రు. తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్‌వో జితేందర్ రెడ్డి, డీఎం జితేందర్ ప్రసాద్, కరీంనగర్ డీఎస్‌వో సురేశ్ రెడ్డి, అధికారులు ప్రభాకర్, లక్ష్మారెడ్డి, పుల్లయ్యలతో పలు మండలాల తహసీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్లు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, డీఎస్‌వోలు, డీఎంలు విస్తృతంగా సోదాలు నిర్వహించడం రైస్ మిల్లు వ్యాపార వర్గాల్లో కలకలం రేపింది.

## అరెస్టు నుంచి తప్పించుకోవడానికి యువకుడి ఆత్మహత్యాయత్నం



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి, జూలై 18: అరెస్టు నుంచి తప్పించుకోవడానికే అఖిల్ అనే యువకుడు భయభ్రాం తులను గురిచేయడం కోసం బ్లేడ్‌తో కోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో గురువారం సీఐ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో తొమ్మిది మందిపై నమోదైన గంజాయి కేసులో చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తోట అఖిల్ నిందితుడిగా ఉన్నాడు. వీరిలో అమీర్, కాల్వ వెంకటేష్, పండుగ అభి, రవిని విచారించగా వారందరికీ తోట అఖిల్ గంజాయిని సప్లయ్ చేసేవాడని తెలిసిందన్నారు. దీంతో అఖిల్‌ను చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన అనంతరం వేములవాడ రూరల్ పోలీసులకు అప్పగించగా వారు తీసుకుపోయే క్రమంలో అప్పటికే తన అన్న రాకేష్ ద్వారా ఒక పథకం ప్రకారం భయభ్రాంతులు గురిచేయాలనే ఉద్దేశంతో బ్లేడు తెప్పించుకొని, అఖిల్ తన శరీరంపైన గాయాలు చేసుకున్నాడన్నారు. ఈ క్రమంలో సిబ్బంది వెంటనే అడ్డుకొని, అతనిని ఆస్పత్రిలో చికిత్స చేయించారని తెలిపారు. అనంతరం అఖిల్‌ను వేములవాడ రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారన్నారు. ఈ సంఘటనలో కేవలం అరెస్టును తప్పించుకోవడానికి ఆడిన నాటకం అన్నారు. చట్ట ప్రకారం చేయవలసిన విధులలో పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తే ఊరుకునేది లేదని, అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అఖిల్ గంజాయికి, మద్యానికి బానిసై జల్సాలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ అరెస్ట్ చేసే సమయంలో పోలీసుల విధులకు ఆటంకం కల్పించడంతో చందుర్తిలో కేసు నమోదు చేశామని వివరించారు.

## విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**- టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్**

గణేశ్‌నగర్, జూలై 18: విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. బట్టలు ఆరవేసే దండెము జిఐ వైర్లపై నుంచి విద్యుత్ వైర్లు వెళ్లడం వలన విద్యుత్ వైర్లలో ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడంతో దండెములకు విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్లాస్టిక్ దండెములను ఉపయో గించాలని కోరారు. విద్యుత్ సరఫరా వైర్లను ఎట్టి పరిస్థితుల్లో దండెంలకు, రేకులకు తగల కుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. భద్రత పట్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం, గృహాలలో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం వల్ల, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడటం వలన, రైతులు స్విచ్ బోర్డు/మోటార్ స్టార్టర్‌ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించక పోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వినియోగదారులు అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

**● ప్రమాదాల నివారణకు విద్యుత్‌శాఖ సూచనలు..**

- రైతులు విద్యుత్ మోటార్లు, పైపులను, ఫుట్ వాల్వులను ఏమరుపాటుతో తాకకూడదు. వ్యవసాయ పంపుసెట్లను, స్టార్టర్లను విధిగా ఎర్తింగ్ చేయాలి. ఎర్తచేయని మోటార్లు, స్టార్టర్లు, పైపులు, ఫుట్ వాల్వులు తాకడం అత్యంత ప్రమాదకరం. రైతులు, వినియోగదారులు స్వయంగా సొంతంగా విద్యుత్ పనులు చేసుకోకుండా అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్‌తో పనులు చేసుకోవాలి. పశువులను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకా లంలో స్తంభాలు తడిగా ఉండటం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- ఇంటి వైరింగ్‌కు సరైన ఎర్తింగ్ చేయాలి. నాణ్యమైన ప్లగ్గులు, సెల్‌ఫోన్ చార్జర్‌ను ఉపయోగించాలి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏబీ స్విచ్‌ల ఆపరేట్, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- కరెంటు లైన్ల కింద పందిరిలు వేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ తీగలను అమర్చి చేపలను పట్టడం వలన షాక్ గురయ్యే అవకాశం ఉంది. ఇలా చేయడం చాలా ప్రమాదకరం. బోర్లు వేసేటపుడు, జెండా ఎగుర వేయునపుడు పైపులు వైర్లకు తాకకుండా జాగ్రత్త వహించాలి. సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడటం వలన షాక్‌కు గురై చనిపోతున్నారు. చార్జింగ్ వైరు తీసి ఫోన్ మాట్లాడాలి. పొలాలకు విద్యుత్ కంచెలు వేయరాదు.
- వర్షాలు కురిసినప్పుడు తడిసిన విద్యుత్ స్తంభాల స్టేవైరు/సపోర్టు వైరును, తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకరాదు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదు. ఇలాంటివి గమనించిన వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలుపాలి.
- విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని ముట్టుకోరాదు. అతడిని రక్షించడానికి విద్యుత్ ప్రవహించని (కర్ర, ప్లాస్టిక్ లాంటి) వస్తువులను వాడాలి.

## ఎక్సైజ్ సీఐకి ప్రశంసాపత్రం

**- గంజాయి సాగు నియంత్రణలో కీలక పాత్ర**


ప్రశంసా పత్రం అందుకుంటున్న సర్వేశ్వర్

జగిత్యాల టౌన్, జూలై 18: గంజాయి సాగు నియంత్రణలో ఎక్సైజ్ సీఐ కీలకంగా వ్యవహరించి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు.. జగిత్యాల డివిజన్‌లో ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న సర్వేశ్వర్ గతంలో ఖమ్మం డివిజన్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా విధులు నిర్వహించాడు. గంజాయి సాగుతో పాటు వాటి ములాలను గుర్తించి 120 కేసుల్లో 4,630 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాడు. రాష్ట్ర స్థాయిలోనే ఖమ్మం సీఐ గంజాయి నిర్మూలనలో మొదటి స్థానంలో నిలిచాడు. సీఐ సర్వేశ్వర్ ప్రతిభను గుర్తించిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలహాసన్ రెడ్డి ప్రశంసాపత్రాన్ని జారీ చేశారు. ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్‌ల చేతుల మీదుగా గురువారం ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన జగిత్యాల సీఐ సర్వేశ్వర్‌ను గురువారం జగిత్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణతో పాటు పలువురు అభినందించారు.

## డివైడర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం


బాలు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 18: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొని బొప్పాపూర్ గ్రామానికి చెందిన వేముల బాలు (35) అనే యువకుడు గురువారం రాత్రి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. బాలు ఇటీవల గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ద్విచక్ర వాహనంపై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వెళుతున్న క్రమంలో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దాంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామని పోలీసులు వివరించారు. బాలుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధితకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

## నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

**- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి**



యువతకు కౌన్సెలింగ్ చేస్తున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

తంగళ్లపల్లి, జూలై 18: నేరాల నియంత్రణనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తోందని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెర కాలనీ, దొమ్మరి వాడలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మట్లాడుతూ ప్రజల రక్షణ గురించి, సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పట్టణ, గ్రామంలో, కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందన్నారు. నేరరహిత గ్రామాలుగా చేయలనే ఉద్దేశంతోనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలను, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగాన్ని నియంత్రించేందుకు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. యువత మాధకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లో గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచతామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సరైన ధ్రువపత్రాలు లేని, నంబర్ ప్లేట్స్ లేని 15 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా వారి యొక్క వాహనాలకు ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగివుండాలని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాలలో మరింత స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు. పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాల్లో, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ మొగిలి, ఎస్ఐలు సుధాకర్, శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది, డిస్ట్రిక్ట్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి




మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

భగత్‌నగర్, జూలై 18: నిరుద్యోగ సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే పరిష్కరించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలిఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ పాలకుల యువజన వ్యతిరేక విధానాలపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేయాలన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యుగేందర్, జిల్లా అధ్యక్షుడు మహేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, చంచుల మురళి, హేమంత్, కళ్యాణ్, ప్రశాంత్, పవన్, వెంకటేష్, రాజు, శంకర్ పాల్గొన్నారు.

## 'ప్రశ్నించడం న్యాయవాదుల హక్కు'



మాట్లాడుతున్న టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్

కరీంనగర్ అర్బన్, జూలై 18: ప్రశ్నించడం న్యాయవాదుల హక్కని టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్, మాజీ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పొన్నం అశోక్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్‌పార్టీ కోసం పదేళ్లుగా కష్టపడ్డ న్యాయవాదులకు తప్పకుండా న్యాయం చేస్తామని ఆయన అన్నారు. గురువారం డీసీసీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ లీగల్‌సెల్ సమావేశం జరిగింది. సీనియర్ న్యాయవాది రాచకొండ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి డీసీసీ లీగల్ సెల్ చైర్మన్ రూపురెడ్డి దేవేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా పొన్నం అశోక్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యతిరేకించారని, ఈ చట్టాలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నదని తెలిపారు.

సీనియర్ న్యాయవాదుల సేవలను వినియోగించుకుంటామని పొన్నం అశోక్‌గౌడ్ తెలిపారు. రూప్‌రెడ్డి దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ పొన్నం అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ లీగల్‌సెల్ బలోపేతం కావాలన్నారు. రాచకొండ ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ న్యాయవాదులకు తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఏజీపీ కల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ రాబోయే అడ్వకేట్స్ హౌస్ బిల్డింగ్స్ సొసైటీ ఎన్నికల్లో బలమైన అభ్యర్థిని బరిలో నిలపాలన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, చక్రధర్, ఉప్పుల అంజనీ ప్రసాద్, పీవీ రాజ్‌కుమార్, లుక్క రాజేశం, సింగిరెడ్డి లక్ష్మారెడ్డి, బద్దం నరసింహారెడ్డి, పెంచాలా లక్ష్మణ్‌రావు, మల్యాల సుజిత్ కుమార్, గంగుల దిలీప్, ఎండి నవాజ్, వడ్లూరి కృష్ణ, కొత్తకొండ శంకర్, బోనాల మురళిమనోహర్, పిజ్జా రవి కుమార్, కూడలి శ్రీధర్, పంజాల కుమారస్వామిగౌడ్, సంజీవరెడ్డి, మల్లేశం, సొల్లు సత్యం, పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

సుభాష్‌నగర్, జూలై 18: ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రంగనవేని శారద అన్నారు. గురువారం తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా ఆయన అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికలకు ముందు నిర్వహించిన 15 రోజుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని హామీలు ఇచ్చినట్లు తెలిపారు. ఆశావర్కర్లు గత 19 సంవత్సరాలుగా కనీస వేతనాలకు నోచుకోకుండా పని బారంతో కాలం వెల్లదీస్తున్నారని వాపోయారు. ఏ ప్రభుత్వం వచ్చిన తమ సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. గతంలో పెరిగిన జీతాల ఏరియర్స్, లెప్రసీ, పోలియో టీకా, ఎలక్షన్ డ్యూటీ బిల్లులు, ఎగ్జామ్స్ సందర్భంగా పనిచేసిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అట్టి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సరిత, సదాలక్ష్మి, సరోజన, ఆసిఫ్‌నగర్, కొత్తపల్లి, కరీంనగర్ అర్బన్ మండలాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు న్యాయం చేయాలి

భగత్‌నగర్, జూలై 18: కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు కొట్టె మురళీకృష్ణ డిమాండ్ చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రైతు రుణమాఫీ అని హామీ ఇచ్చి ఇప్పుడు మూడు విడుతలుగా విడుదల చేస్తామని రైతులను వంచించడమే అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మార్గదరకాల్లో కొర్రీలు చూసి రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. రుణమాఫీలో కౌలు రైతుల ప్రస్తావన లేదన్నారు. నిబంధనలు లేకుండా రుణాలు తీసుకున్న రైతులందరి రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

## టూల్స్ ఇంజనీరింగ్‌లో ప్రత్యేక శిక్షణ

కరీంనగర్ టౌన్, జూలై 18: గ్రామీణ యువతకు, విద్యార్థులకు సాంకేతిక శిక్షణ అందించడం, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, టూల్ డిజైన్ రంగాలలో లోటును తగ్గించడం కోసం కరీంనగర్‌లో టూల్స్ విస్తరణ కేంద్రాన్ని స్థాపించినట్లు ఫ్యాకల్టీ జే వెంకటరాజేశ్ తెలిపారు. టూల్ ఇంజనీరింగ్, సీఏడీ, సీఏఎంలో ప్రత్యేక కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సంస్థ 1968లో భారత ప్రభుత్వం ద్వారా యూఎన్‌డీపీ, ఐఎల్‌వో సహకారంతో స్థాపించినట్లు పేర్కొన్నారు. టూల్ డిజైన్, తయారీ రంగాలలో పరిశ్రమల అవసరాలను తీర్చడం, ఈ రంగాలలో సాంకేతిక సిబ్బందికి శిక్షణ ఇవ్వడమే లక్ష్యమన్నారు. 10 రకాల కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు బహుళజాతి కంపెనీలు లేదా తయారీ సంస్థల్లో ఉద్యోగాలను పొందడానికి ప్లేస్‌మెంట్ సహాయం కూడా అందిస్తారని తెలిపారు. వివరాలకు 9494647201 లేదా 0878-2931803 నంబర్లల్లో సంప్రదించాలని కోరారు.

## 'ఎంఐఎం'ను సంస్థాగతంగా బలోపేతం చేయండి

కరీంనగర్ టౌన్, జూలై 18: జిల్లాలో ఎంఐఎం పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని ఎంఐఎం పార్టీ రాష్ట్ర సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి సమద్ బిన్ అబ్దాద్ పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ అధినేత, ఎంపీ అసదొద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు గురువారం జిల్లాలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా నగరంలోని దారుస్సలాంలో ఎంఐఎం కార్పొరేటర్లు, నగర నాయకులు, డివిజన్ అధ్యక్షులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, కార్పొరేటర్లు, నాయకులతో కలిసి సమద్‌బిన్ అబ్దాద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నాయకులు బర్కత్ అలీ, మొయిజుద్దీన్ ఖాద్రీ, ఆతిఫ్ అతిన, ఇబ్రహీం పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న సబ్బని వెంకట్

హుజూరాబాద్, జూలై 18: హుజూరాబాద్ పట్టణంలో నాలుగు రోజుల క్రితం అగ్ని ప్రమాదం జరగగా బాధితులకు గురువారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద సామాజిక వేత్త, జన్ ఫ్యాక్ట్ వైస్ ప్రెసిడెంట్ సబ్బని వెంకట్ ఒకోక్క కుటుంబానికి రూ. 5వేల ఆర్థిక సహాయం అందజేశారు. 31 మంది చిరువ్యాపారులకు రూ. 1.55లక్షలు వ్యక్తిగతంగా వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకొని సంఘటనలు జరిగితే చిరువ్యాపారులకు మానవత ధృక్పదంతో ప్రతి ఒక్కరూ సాయం అందించాలని కోరారు. వ్యాపారం కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభు త్వం ఒకోక్కరికి రూ. లక్ష ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్ర మంలో కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య, చిరువ్యాపారులు పాల్గొన్నారు.

# రైతు రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నాం

-ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ -జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



హుజూరాబాద్‌లో స్వీట్లు తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకుడు వొడితెల ప్రణవ్

కరీంనగర్ అర్బన్, జూలై 18: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణ మాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావులు అన్నారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పురం రాజేశం ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమళ్ళ శ్రీనివాస్, పురం రాజేశం, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పులి ఆంజనేయులుగౌడ్, బోనాల శ్రీనివాస్, పడిశెట్టి భూమయ్య, వంగల విద్యాసాగర్, దన్నాసింగ్, షహే న్‌షా, నూనె గోపాల్‌రెడ్డి, కుంభాల రాజకుమార్, మూల రవీందర్‌రెడ్డి, గంగుల దిలీప్, పోరండ్ల రమేష్, శ్రీరాముల రమేష్ ,మూల జయపాల్, చింతల కిషన్, సుదర్శన్ పాల్గొన్నారు.

**●గణేశ్‌నగర్:** రైతు రుణ మాఫీ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, అబ్దుల్ రెహమాన్, ఖమ్రొద్దీన్, కుర్ర పోచయ్య, షబానా మహమ్మద్, లత పాల్గొన్నారు.

**●కరీంనగర్ రూరల్:** కరీంనగర్ మండల కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజక వర్గ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి పాల్గొన్నారు.

●మండలంలోని చామనపెల్లిలో ఏర్పాటు చేసిన రైతు వేదికల్లో రైతులు ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సత్యం, ఏఈవోలు పాల్గొన్నారు.

**●భగత్‌నగర్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ కార్యక్రమాన్ని కొత్తపల్లిలోని రైతు వేదికలో కార్యక్రమాన్ని వీక్షించారు. ఈకార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంజాల స్వామిగౌడ్ పాల్గొన్నారు.

**●హుజూరాబాద్:** పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సంబరాలు నిర్వహించారు. మొదట కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో నాయకులు మోటర్ సైకిల్‌పై ర్యాలీగా రైతువేదిక వద్దకు చేరుకున్నారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

**●వీణవంక:** మండలంలోని చల్లూరు గ్రామంలోని రైతు వేదికలో రైతులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమములో నల్ల కొండాల్‌రెడ్డి, ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, సాహెబ్ హుస్సేన్, గంగాడి తిరుపతిరెడ్డి, గూటం హరిప్రసాద్‌రెడ్డి, మ్యాక వీరస్వామి, పైడి కుమార్, మేకల ఎల్లారెడ్డి, సత్యనారాయణ, సతీష్ పాల్గొన్నారు.

**●శంకరపట్నం:** మండలంలోని రైతు వేదికల్లో రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కన్నాపూర్, కాచాపూర్, మొలంగూర్, మెట్‌పల్లి, తాడికల్ రైతు వేదికల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

**●సైదాపూర్:** సైదాపూర్ రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రుణ మాఫీ కార్యక్రమాన్ని రైతులకు వీడియో కాన్ఫరెన్ ద్వారా చూపించారు. కార్యక్రమంలో వెన్కేపల్లి ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

**●ఇల్లందకుంట:** మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకించారు. కార్యక్రమంలో ఏవో రజిత, ఏఈవోలు తిరుపతి, రాకేష్, సంపత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**●మానకొండూర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో రైతు రుణమాఫీ చేయడం చరిత్రాత్మకమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్‌లోని రైతు వేదికలో మండల రైతులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అంతకు ముందు మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు రామిడి తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో సదాశివపల్లి జంక్షన్ నుంచి మానకొండూర్ రైతు వేదిక వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి బి. శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి తాల్లపల్లి సంపత్‌గౌడ్, మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రాచారి, గసిగంటి సంపత్, రామిడి తిరుమల్‌రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, జడల రమేశ్ పాల్గొన్నారు.

**●తిమ్మాపూర్:** మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షులు రమణారెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సత్యనారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి సురేందర్ పాల్గొన్నారు.

**●గంగాధర:** రైతు రుణమాఫీ చరిత్రాత్మక నిర్ణయమని సీనియర్ సింగిల్‌విండో అధ్యక్షుడు వెలిచాల తిరుమల్‌రావు అన్నారు. లక్ష రుణమాఫీ చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గంగాధర రైతు వేదికలో ఏడీఏ రామారావు, రైతులు సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

**●గన్నేరువరం:** మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, బొడ్డు సునీల్, శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ రైతు హక్కుల సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లెల జగన్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు.

**●చిగురుమామిడి:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుందని హౌస్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రంజిత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, వంగర మల్లేశం, ప్రవీణ్, లచ్చిరెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

**●చొప్పదండి:** చొప్పదండిలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

**●రామడుగు:** సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభి షేకం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు వెంకటేశ్వర్‌రావు, మురళీకృష్ణ, ఏవో యాస్మిన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, జిల్లా బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

# ఎంఈవో కార్యాలయ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?

-అర్ధాంతరంగా నిలిచిన పనులు -పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు



దుర్శేడ్‌లో పూర్తి కాని ఎంఈవో కార్యాలయ నిర్మాణం

కరీంనగర్ రూరల్, జూలై18: కరీంనగర్ రూరల్ మండల ఎంఈవో కార్యాలయ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియడం లేదు. మండలాల పునర్విభజన అనంతరం ఏర్పడ్డ కరీంనగర్ రూరల్ మండలానికి 2017లో ఎంఈవో కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం 30లక్షల రూపాయల నిధులు మంజూరు చేసింది. దుర్శేడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నాలుగు సంవత్సరాల క్రితం పనులు ప్రారంభించారు. భవన నిర్మాణాలు అసంపూర్తిగా చేపట్టడంతో ప్రస్తుతం భవనం నిరుపయోగంగా మారి పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. కనీసం తలుపులు, పైపులైన్, ఇతర పనులు కూడా పూర్తి కాలేదు. చేసిన పనుల్లో నాణ్యతా లోపాలు కనిపిస్తున్నాయి. సరిగ్గా పనులు చేపట్టకపోవడంతో ఇప్పుడే పైపులైన్ తేలింది. ఇతర మండలాల్లో 30లక్షల నిధులతో చేపట్టిన ఎంఈవో కార్యాలయాల భవనాలు పూర్తయి కార్యకలాపాలు ప్రారంభించినప్పటికీ కరీంనగర్ రూరల్ మండల విద్యాశాఖ భవనం పూర్తి కాకపోవడంతో పలు విమర్శలకు దారి తీస్తుంది.

కరీంనగర్ రూరల్ విద్యాశాఖకు సంబంధించిన వ్యవహరాలు కరీంనగర్ అర్బన్ కార్యాలయంలోనే నిర్వహిస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణానికి నిధులు సరిపోక పోవడంతోనే పనులు నిలుపుదల చేశారని ఎంఈవో తెలిపారు. మళ్లీ పనుల ప్రారంభం కోసం జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరయ్యాక పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

**●ఆరు మండలాలకు ఒకే ఎంఈవో**

కరీంనగర్ రూరల్ మండలానికి విద్యాశాఖ అధికారిగా మధుసూదనచారి విధులు నిర్వహిస్తు న్నారు. అయితే ఈయనకు మరో ఐదు మండలాల ఇన్‌చార్జి బాధ్యతలను అప్పజెప్పారు. కరీంనగర్ అర్బన్, మానకొండూర్, తిమ్మాపూర్, శంకరపట్నం, గన్నేరువరం మండలాలకు మధుసూధనచారి ఇన్‌చార్జి ఎంఈవోగా వ్యవహరిస్తున్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి




మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

తిమ్మాపూర్, జూలై 18: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మండలంలోని పర్లపల్లి గ్రామంలో గురువారం సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మర్రి వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని చెప్పారు. రైతులందరికి ఒకే దఫా రుణమాఫీ అని చెప్పి మాట తప్పిందని విమర్శించారు. పర్లపల్లి గ్రామంలో ఉన్న హరిత బయో ప్రోడక్స్ ఫ్యాక్టరీ నుంచి ఉదయం వేళ విపరీతమైన దుర్గంధం వెదజల్లుతోందని చెప్పారు. దీంతో చుట్టూ ఉన్న నాలుగు గ్రామాల ప్రజలు భరించలేక పోతున్నారని అన్నారు. రహదారిపై రాకపోకలు సాగించే వాహనాదారులు కళ్లల్లో దుమ్ము పడుతుండడంతో అవస్థలు పడుతున్నారని చెప్పారు. దీనిపై ఫ్యాక్టరీని మూయించేంత వరకు పార్టీ పోరాడటానికి సిద్ధంగా ఉందని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, మండల కార్యదర్శి బోయిని తిరుపతి, నాయకులు పిట్టల శ్రీనివాస్, సూరం మల్లేశం, బోయిని అశోక్, గంగిపల్లి శంకర్ పాల్గొన్నారు.

## విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

చొప్పదండి, జూలై 18: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని కరీం నగర్ రూరల్ ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ అన్నారు. చొప్పదండి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గంజాయి వద్దు అనే అంశంపై గురువారం విద్యా ర్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ విద్యార్థి దశలో వ్యసనాల బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి పోస్టర్లు ఆవిష్క రించారు. అనంతరం గంజాయి తీసుకోబోమని విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వైద్యుల రాజిరెడ్డి, ఎస్ఐ లక్ష్మణ్, భూమ య్య, అశోక్, అనిల్, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొద్ది మందికే రుణమాఫీ సరికాదు

గంగాధర, జూలై 18: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొద్ది మందికే రుణమాఫీ చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధరలో గురువారం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో 2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలమీద కొర్రీలుపెడుతూ కొద్దిమందికే మాఫీ చేయడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 39 మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తుంటే కేవలం 11 లక్షల మందికేచేయడం అన్యాయమన్నారు. ఈ లెక్కన నూటి 70 శాతం మందికి వర్తించడం లేదని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడానికే కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న డ్రామాలన్నారు. సమాచారం ప్రకారం లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య దాదాపుగా 39 లక్షలు ఉందని చెప్పారు. మిగిలిన వారికి రుణమాఫీ చేయకపోవడం కారణాలేంటో ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.

## 'రైతు రుణమాఫీలో నిబంధనలు సడలించాలి'

చిగురుమామిడి, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీలో నిబంధనలు సడలించి అందరికీ వర్తింజేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడం సంతోషకరమని అన్నారు. అలాగే రైతు భరోసా అందరికీ వర్తింపచేయాలని కోరారు. దీనిపై తాము ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడుతామని చెప్పారు. ప్రభుత్వం రైతులందరికీ ప్రయోజనం చేకూరేలా నిర్ణయం తీసుకోవాలని కోరుతామని తెలిపారు. బ్యాంకు అధికారులు రైతులకు పంట రుణాలు ఇవ్వడంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, మాజీ జడ్పీ టీసి అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె చిన్న స్వామి, గూడెం లక్ష్మి, రాకం అంజవ్వ, తేరాల సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టరు చాడ శ్రీధర్‌రెడ్డి, కాంతల శ్రీనివాస్‌రెడ్డిపాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

మండలంలోని గునుకులపల్లిలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ఆర్టీసీ డ్రైవర్ చిట్యాల మనోహర్ రెడ్డి కుటుంబ సభ్యులను చాడ వెంకట్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఎన్నికల ప్రక్రియపై అవగాహన

హుజూరాబాద్, జూలై 18: పట్టణంలోని ఆల్ఫోర్స్ జీనియస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం హౌజ్ పోలింగ్ నిర్వహించి విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజల ప్రగతికి ఎన్నికలే కీలకమన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు విద్యార్థుల కృషి ఎంతగానో అవసరమని చెప్పారు. ఓటు హక్కు ప్రాధాన్యం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యా యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

హుజూరాబాద్‌రూరల్, జూలై 18: పట్టు పురుగుల పెంపకంలో రైతులు సాంకేతిక యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభాలు పొందవచ్చని ములుగు శాస్త్రవేత్త డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో గురువారం పట్టు పురుగుల కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పురుగుల పెంపకం లో రైతులకు పలు సాంకేతిక అంశాలపై వివరించారు. ఎరువులు వేసే విధానం, పలు రకాల వ్యాధి నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా అధికారులకు కలిసి వివరిస్తే తగిన సూచనలు చేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అధికారి డాక్టర్ గుండి రాఘువేందర్, డివిజన్ పట్టు పరిశ్రమ అధికారి మహమ్మద్ రషీద్, రైతులు పాల్గొన్నారు.

## క్రీడాకారిణిని అభినందించిన సీపీ

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 18: సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ విద్యార్థిని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అభినందించారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం చైత్రీని పోలీస్ అన్యువల్ స్పోర్ట్స్ మీట్‌లో అత్యంత ప్రతిభ కనబరిచింది. గురువారం సీపీ చేతుల మీదుగా అప్రిషియేషన్ సర్టిఫికెట్‌ను అందుకున్నట్లు పాఠశాల చైర్మన్ సిహెచ్ శ్రీనివాస్‌రావు తెలిపారు. చైత్రిని గత మూడు సంవత్సరాల నుంచి కరాటే వివిధ కాంపిటీషన్స్‌లో వివిధ విభాగాలలో ఎన్నో గోల్డ్‌మెడల్స్, సర్టిఫికెట్లు సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వి కుమారస్వామి, హెచ్‌ఎం ధనలక్ష్మి, పీఈటీ గోలి నరేందర్, కరాటే మాస్టర్ పుల్లూరి శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు చైత్రిని అభినందించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

గణేశ్‌నగర్, జూలై 18: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు గురువారం మిస్టర్ క్వార్టర్స్‌లో బీసీ సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు కేశిపెద్ది శ్రీధర్ రాజు, రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్ లు పాల్గొన్నారు.

## వైభవంగా శాకాంబరి ఉత్సవాలు

కరీంనగర్ రూరల్, జూలై16:కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో గురువారం అమ్మవారిని గుండు దోస కాయల మాలలతో అలంకరించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందన

తిమ్మాపూర్, జూలై 18: జ్యోతిష్మతి కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు టీసీ ఎస్ (టాటా కన్సల్టెంట్ సర్వీస్ కంపెనీ లిమిటెడ్) గ్రేడ్ సీ-1లో సిస్టం ఇంజనీర్ ఉద్యోగాలకు ఎంపికవడంతో గురువారం విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిష్మతిలో ఇటీవలే బీటెక్ పూర్తి చేసుకున్న కె.ఉదయ్‌కుమార్, జి ప్రశాంత్, కె.సాయికృష్ణ ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. వీరికి వార్షిక వేతనం ఏడు లక్షల ప్యాకేజీ రానుందని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్, సెక్రెటరీ సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ కేఎస్‌రావు, డీన్ వైశాలి పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

చొప్పదండి,జూలై 18: చొప్పదండికి చెందిన నిరుపేద మహిళ జంగం తార అనారోగ్యంతో మరణించగా అంత్యక్రియల కోసం రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఐదు వేల రూపాయలు అందజేశారు. చొప్పదండికి చెందిన బుర్ర రాజు అనారోగ్యంతో మరణించగా సంతోష్‌నగర్ యువజన సంఘం సభ్యులు 5,600 రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో చీకట్ల గంగ రాజు, పిట్టల రాజు, చీకట్ల కనకరాజు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్ అందజేత

గన్నేరువరం, జూలై18: తిమ్మాపూర్ మండలం వచ్చునూరు గ్రామానికి చెందిన కుంభం రవి ఈనెల 3న హనుమాజిపల్లి గ్రామంలో మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా పోలీసులు గుర్తించి గురువారం అతడికి అందజేశారు. ఎస్ఐ తాండ్ర నరేష్ మాటాడుతూ మొబైల్ పోగొట్టుకున్న వారు ఫిర్యాదు చేస్తే సీఈఐ ఆర్ పోర్టల్ ద్వారా గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు.

## నిధులు మంజూరు చేయాలి

జమ్మికుంట, జూలై 18: పట్టణంలోని ఆరో వార్డులో వరద కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆరో వార్డు కౌన్సిలర్ నరేష్ గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి ఉన్నారు.

## దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

జమ్మికుంటరూరల్, జూలై18: జమ్మికుంటలోని సాయి మానసిక దివ్యాంగుల విద్యార్థులకు వరంగల్ జిల్లా బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి శర్మ దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదిత్య శర్మ, పరాంకుశం, కృష్ణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రికి సన్మానం

జమ్మికుంట, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడంతో జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి గురువారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు మంత్రులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.